# 6. దసరా

(అవి దసరా నవరాత్రుల రోజులు. అది ముంబయిలో ఒక కాలని. కాలని మధ్యలో చక్కగా అలంకరించిన రంగురంగుల షామియానా, అందులో ఒక మూల కోలాటం కర్రలు, వాయిద్యాలు ఉన్నాయి. కొన్ని కుర్చీలు కూడా వేసి వున్నాయి. ఆహుతులు అందరితో ఆ ప్రాంగణం కళకళలాడుతోంది. ఇంకొద్ది సేపట్లో కోలాటం (దాండియా) గర్భానృత్యం మొదలవుతాయి. పిల్లలంతా ఒక చోట చేరారు. ప్రణవి వాళ్ళ నాన్నమ్మతో వచ్చింది.)



**ప్రణవి** : నాన్నమ్మా! వీళ్ళంతా నా స్నేహితులు. గౌరవ్, షబ్నమ్, లక్కీ సింగ్, మేరి.

**పిల్లలు** : (ముక్త కంఠంతో/ఒక్కసారిగా) నమస్కారం నాన్నమ్మ.

**నాన్నమ్మ** : మీ అందరికీ నా ఆశీస్సులు. మిమ్మల్ని ఇలా కలుసుకోవడం నాకు చాలా ఆనందంగా ఉంది.

**లక్కీ సింగ్** : ఈ తొమ్మిది రోజులు ఎంతో సంతోషంగా గడిచాయి. రేపు దసరా!

**షబ్నమ్** : మళ్ళీ సంవత్సరం ఆగితే కాని దసరా రాదు. ఈ సరదా కూడా రాదు.

**గౌరవ్** : మీరు పండుగల గురించి రకరకాల విషయాలు, కథలు చెప్తారని ప్రణవి చెప్పింది. ఈ రోజు మీరు మాకు దసరా గురించి చెప్తారా!

**నాన్నమ్మ** : తప్పకుండా! ఈ పండుగని శరదృతువులో ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నుండి దశమి వరకు జరుపుతారు. ఈ తొమ్మిది రోజులు దేవీ పూజలు చేస్తారు. అందువలన ఈ పండుగను 'దేవీ నవరాత్రులు' అని కూడా అంటారు.

**మేరి** : క్రీస్తు పుట్టిన రోజును క్రిస్మస్‌గా జరుపుకుంటాం. మరి ఈ దసరా ఏ సందర్భంగా చేస్తారు.

**నాన్నమ్మ** : పూర్వం మహిషాసురుడు అనే రాక్షసుడు దేవతలను, ప్రజలను బాధించేవాడు. వారంతా విష్ణుమూర్తికి, శివునికి మొరపెట్టుకున్నారు. వారు దేవిని సృష్టించి అనేక ఆయుధాలు బహుకరించారు. ఆమె మహిషాసురునితో తొమ్మిది రోజులు యుద్ధం చేసి చివరికి ఆ దుర్మార్గుని సంహరించింది. ఆ ఆనందంతో ప్రజలు ఈ పండుగను జరుపుకుంటున్నారు.

**ప్రణవి** : నాన్నమ్మా! దసరా పండుగను విజయదశమి అని కూడా అంటారు కదా! ఎందుకు?

**నాన్నమ్మ** : పాండవులు ఈ దశమి రోజున శమీవృక్షాన్ని పూజించి ఆయుధాలు ధరించి కౌరవులపై విజయం సాధించారు. అదే విధంగా శ్రీరాముడు ఈ దశమి నాడే దేవీవ్రతం చేసి రావణాసురుని సంహరించి విజయం పొందాడు. అందుకే దీన్ని విజయదశమి అంటారు.

**లక్కీ సంగ్ :** భారతదేశం అంతా ఈ సమయంలో దాండియా ఆడుతారా?

**నాన్నమ్మ :** లేదు. దక్షిణ భారతదేశంలో కొన్ని ప్రాంతాలలో బొమ్మల కొలువులు పెడతారు. వాహన పూజలు, ఆయుధ పూజలు చేస్తారు. వివిధ రంగులు పూసుకొని దసరా వేషాలు వేస్తారు. వాటిలో పులి వేషం ముఖ్యమైనది.

**మేరీ :** మరి ఉత్తర భారతదేశంలో ఏం చేస్తారు?

**నాన్నమ్మ :** ఉత్తర భారతంలో రామలీల ఉత్సవాలు జరుపుతారు. పిల్లలు, పెద్దలు కలిసి దాండియా కూడా ఆడ్తారు.

**గౌరవ్ :** నేను క్రిందటి దసరా పండుగకు మా అత్తయ్య వాళ్ళింటికి ఖమ్మం వెళ్ళాను. అక్కడ బతుకమ్మ పండుగ అని చేశారు. రకరకాల పూలతో బతుకమ్మని అలంకరించి దాని చుట్టూ పాటలు పాడుతూ చప్పట్లు చరుస్తూ తిరిగారు. చివరకు నీళ్ళలో నిమజ్జనం చేసారు.

**నాన్నమ్మ :** ఇన్ని విషయాలు తెలుసుకున్న తర్వాత మీకేం అనిపిస్తుందో చెప్పండి.

**పిల్లలు :** చెడు మీద ఎప్పుడూ మంచి గెలుస్తుంది అనిపిస్తుంది.

**నాన్నమ్మ :** ఔనౌను. నిజమే. అదిగో మీ దాండియా మొదలైంది. వెళ్ళండి. నేను ఇక్కడ కూర్చుని మిమ్మల్ని చూస్తాను.

---

## I. వినండి-సంభాషించండి.

1. జాతీయ పండుగలు అంటే ఏమిటి? అవి ఏవి?
2. నీకు నచ్చిన పండుగను గూర్చి మిత్రునికి వివరించు.
3. క్రిస్మస్, రంజాన్ పండుగలు ఎలా జరుపుకుంటారు? చర్చించండి.

## II. చదవండి-ఆలోచించండి-రాయండి.

### అ. కింది ప్రశ్నలకు జవాబులు రాయండి.

1. దసరా పండుగ ఎప్పుడు జరుపుకుంటారు?
2. మహిషాసుర వృత్తాంతాన్ని తెలపండి.
3. 'విజయదశమి' అని ఎందుకన్నారు?
4. దక్షిణ భారతంలో ఈ దసరా పండుగ ఎలా జరుపుతారు?
5. దసరా పండుగ ఉత్తర భారతంలో జరుపుకునే తీరును వివరించండి.

### ఆ. కింది పండుగలు ఏయే మాసాల్లో వస్తాయో ఆలోచించి జతపరచండి.

| | |
|---|---|
| 1. కృష్ణాష్టమి | అ. ఆశ్వయుజం |
| 2. వినాయక చవితి | ఆ. చైత్రం |
| 3. ఉగాది | ఇ. శ్రావణం |
| 4. దసరా | ఈ. భాద్రపదం |

### ఇ. ఖాళీలను సరియైన పదాలతో పూరించండి.

1. దసరా పండుగను ________ జరుపుకుంటారు.
   (అ) మూడు రోజులు (ఆ) తొమ్మిది రోజులు
2. దసరా పండుగను ________ అని కూడా అంటారు.
   (అ) భోగి (ఆ) విజయదశమి
3. పూర్వం ________ అనే రాక్షసుడు దేవతలను, ప్రజలను బాధించేవాడు.
   (అ) మహిషాసురుడు (ఆ) తారకాసురుడు

**శబ్ద కాలుష్యం కాని రీతిలో పండుగలు, ఉత్సవాలు జరుపుకుందాం**

## III. భాషావగాహన

**అ. వచనము మార్చి రాయండి.**

1. రాజు = ______
2. వాయిద్యాలు = ______
3. రాక్షసుడు = ______
4. పండుగ = ______

**ఆ. కింద వాక్యాలను కుండలీకరణంలో ఇవ్వబడిన సరైన విభక్తులతో పూరించి రాయండి.**

(ని, గురించి, తో, ను, లో)

1. ఈ రాత్రి [ ] దాండియా ఆడటం అయిపోతుంది.
2. దసరా పండుగ [ ] చెప్తారా?
3. ఈ పండుగ శరదృతువు [ ] జరుపుకుంటారు.
4. వారు దేవి [ ] సృష్టించారు.
5. రకరకాల పూలతో బతుకమ్మ [ ] అలంకరిస్తారు.

**ఇ. గీతగీసిన పదాలు కుండలీకరణంలో అడిగిన విధంగా రాయండి.**

1. <u>మీరు</u> పండుగల గురించి చెపుతారు. (భాషాభాగము)
2. <u>దేవీ</u> పూజలు చేస్తారు (వాచకము)
3. పాండవులు విజయం <u>సాధించారు</u> (కాలము)
4. కొన్ని ప్రాంతాల్లో బొమ్మల <u>కొలువులు</u> పెడతారు (వచనము)

## IV. అ. దసరా, సంక్రాంతి పండుగలను ఎలా జరుపుకుంటారో కింది అల్లిక ఆధారంగా 10 వాక్యాలు రాయండి.

**1. దసరా:-**




**2. సంక్రాంతి:**




**నేనివి నేర్చుకున్నా.**

- వివిధ ప్రాంతాలలో దసరా ఎలా జరుపుకుంటారు.

